క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి శ్రీకారం



ఆలయ నిర్మాణానికి కొలతలు వేస్తున్న ఇంజినీర్లు

తంబళ్లపల్లె : మండలంలోని కన్నెమడుగు పంచాయతీ చిన్నమాచిరెడ్డిగారిపల్లెలో శ్రీ వీరభద్ర స్వామి ఆలయ నిర్మాణానికి దేవాదాయశాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. మంగళవారం దేవాదాయశాఖ ఇంజినీర్లు పూజలు నిర్వహించి కొలతలు వేశారు. రూ. 1.70 లక్షతో ఆలయ నిర్మాణ పనులు త్వరలో చేపడతామన్నారు. కార్యక్రమంలో దేవరపెద్ద కేశవరెడ్డి, రవిశంకర్ రెడ్డి, రఘురాంరెడ్డి, బిందు సాగర్, శంకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

31న దీపావళి

మదనపల్లె సిటీ : దీపావళి పండుగ ఈనెల 31వ తేదీన నిర్వహించుకోవాలని ప్రముఖ పంచాగకర్త శివకుమార్‌శర్మ తెలిపారు. 31వ తేదీ మధ్యాహ్నం 2.47 నిమిషాలకు ప్రారంభమై నవంబర్ 1వ తేదీ శుక్రవారం సాయంత్రం 4.50 వరకు ఉంటుందన్నారు. 31వతేదీ సాయంత్రం 5.34 నుంచి దీపావళి ధనలక్ష్మి పూజలు నిర్వహించుకోవచ్చని తెలిపారు.

మదనపల్లెను జిల్లాగా ప్రకటించాలి

మదనపల్లె : రాబోయే రెండేళ్ల జనాభా లెక్కల సేకరణ చేపడుతున్న నేపథ్యంలో ఈ ఏడాది డిసెంబర్ చివరినాటికి మదనపల్లెను జిల్లాగా ప్రకటించి, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ స్థానిక ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మదనపల్లె జిల్లా సాధనసమితి కన్వీనర్ పీటీఎం.శివప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తారని హెచ్చరించారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

పీలేరు : భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నామని సర్వేయర్ కిరణ్మయి తెలిపారు. మంగళవారం మండలంలోని కావుపల్లె లో భూ రీ సర్వే సమస్యలపై గ్రామసభ నిర్వహించి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. 41మంది వినతిపత్రాలు అందజేయగా.. 29 మంది రైతులు విస్తీరణం సమస్యలు, 9 మంది విభజన కోసం, ఇద్దరు రైతులు పెద్దల పేరు పట్టాలు మార్పు కోసం కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సర్వేయర్ బాలకృష్ణ, వీఆర్‌ఓ వెంకటేశ్వర్లు, కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం



బాలికలకు సూచనలిస్తున్న డాక్టర్ ఆశాలత

తంబళ్లపల్లె : వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ముఖ్యమని కోసువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ ఆశాలత తెలిపారు. మంగళవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో బాలికలకు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం జరిగింది. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మునికుమార్, ప్రిన్సిపాల్ శ్రీమతి, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిర్మాణాలు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఏఈ చంద్రశేఖర్ రెడ్డి

కలికిరి : కలికిరి గ్రామ పంచాయతీ పరిధిలోని కె.కొత్తపల్లి లే ఔట్‌లో ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదారులకు హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏడాది డిసెంబర్ లోపు ఇదివరకు మంజూరైన ఇండ్లు నిర్మాణాలు పూర్తి చేయక పోతే బిల్లులు మంజూరుకావని, ప్రస్తుతం నిర్మాణాలు వేగవతం చేస్తే బిల్లులు మంజూరు చేస్తామని తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు వెంకటేష్, ప్రసాద్, స్వర్ణకుమారి పాల్గొన్నారు.

కోడింగ్‌పై వర్క్‌షాప్

రామాపురం : భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో బిగినర్స్ కోడింగ్ బూట్ క్యాంప్, జీరో టు కోడ్ అనే శీర్షికతో మంగళవారం ఒక రోజు వర్క్‌షాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కడప కేఎస్‌ఆర్‌ఎం ప్రొఫెసర్ డాక్టర్ వి.వెంకటరమణ పాల్గొన్నారు. విద్యార్థులు కోడింగ్ ప్రపంచంలోకి అడుగు పెట్టడానికి ఉన్న అవకాశాలను తెలియజేశారు. ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లో వివిధ అంశాలను వివరించారు. కోడింగ్ సమస్యలను పరిష్కరించడానికి వివిధ పద్ధతులను చెప్పారు. ఈ ప్రత్యక్ష కార్యక్రమాలు విద్యార్థులకు కోడింగ్ ఆచరణాత్మక అనుభవాన్ని, నైపుణ్యాలను పెంపొందిస్తాయన్నారు.

నాడు ఆదరణ.. నేడు ఆవేదన

మూతపడిన గ్రంథాలయాలు
తెరిపించాలంటున్న పాఠకులు



అప్పారావువీధిలో మూతపడిన రీడింగ్ రూము



నెహ్రూనగర్‌లో మూతపడిన రీడింగ్ రూము

మదనపల్లె సిటీ : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు. స్వాతంత్ర్యం పూర్వం నుంచి గ్రంథాలయాలకు ఎంతో చరిత్ర ఉంది. ఇలాంటి గ్రంథాలయాలకు నేడు నిరాదరణకు గురవుతున్నాయి. పాఠకులకు విజ్ఞానంతో పాటు విలువైన సమాచారం అందించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. మదనపల్లె పట్టణంలో పేద, మధ్య తరగతి ప్రజల కోసం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రీడింగ్ రూములు ఏర్పాటు చేశారు. పట్టణంలోని స్థానిక నెహ్రూనగర్ సమీపంలో ఫైర్‌స్టేషన్ వద్ద రీడింగ్ రూము, అప్పారావువీధి, పటేల్ రోడ్డులో రీడింగ్ రూములు నడుస్తున్నాయి. ఆ ప్రాంతాల్లోని ప్రజలకు విజ్ఞానాన్ని అందించాలన్న ఉద్దేశంతో రీడింగ్ రూములు ఏర్పాటు చేశారు.

ఆందోళనలో పాఠకులు

స్థానిక ఫైర్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన రీడింగ్ రూము ఏడాది క్రితం మూసివేశారు. దీన్ని పారిశుద్ధ్య కార్మికులకు మస్టర్ గదిగా మార్చివేశారు. అప్పట్లో ఈ ప్రాంత వాసులు గ్రంథాలయానికి వచ్చి దిన, వార, ఇతర పత్రికలు చదువుకువారు. దీంతో పాటు విశ్రాంత ఉద్యోగులు అధికంగా వచ్చి పత్రికలు చదివేశారు. స్థానిక అప్పారావువీధిలోని గ్రంథాలయం నాలుగు నెలలు నుంచి మూతపడింది. ఇక్కడ పనిచేసే ఉద్యోగి రిటైర్డు కావడంతో అప్పటి నుంచి దీన్ని మూసివేశారు. ఈ ప్రాంతవాసులకు ఈ గ్రంథాలయం ఎంతో ఉపయోగంగా ఉండేది. దీన్ని మూసివేయడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు చెల్లించే ఆస్తి పన్నులో గ్రంతాలయ పన్నులు కూడా వసూలు చేస్తున్నారు. సెస్సు రూపంలో మున్సిపాలిటీకి ఆదాయం వస్తున్నా గ్రంథాలయాల నిర్వహణపై ఆసక్తి చూపడం లేదు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ ప్రమీల మాట్లాడుతూ సిబ్బంది కొరత కారణంగా మూతవేశామని త్వరలో తెరుస్తామన్నారు.

లైబ్రరీలు తెరవాలి



ఎంతో చరిత్ర కలిగిన అప్పారావువీధి లైబ్రరీని తెరవాలి. ప్రతి రోజు ఈ ప్రాంత వాసులు వచ్చి దినపత్రికలతో పాటు ఇతర పత్రికలు చదువుకోవడానికి వస్తారు. నాలుగు నెలల నుంచి మూత వేశారు. అధికారులకు తెలియజేశాం. అదిగో ఇదిగో అంటున్నారే తప్ప తెరవడం లేదు.

– సత్యం, అప్పారావువీధి, మదనపల్లె

మూసేయడం బాధాకరం



మున్సిపాలిటీ పన్నులు వసూళ్లు చేసే శ్రద్ధ లైబ్రరీల నిర్వహణపై లేకుండా పోయింది. ప్రతి రోజు ఎంతో మంది విద్యార్థులతో పాటు స్థానికులు దిన, వార పత్రికలు చదువుతారు. ఉదయం , సాయంత్రం లైబ్రరీకి వచ్చి అనేక విషయాలు తెలుసుకుంటారు. ఇలాంటి లైబ్రరీలు మూసివేయడం బాధకరం.

–సుధాకర్, అప్పారావువీధి, మదనపల్లె

రెవెన్యూ సమస్యలపై నిర్లక్ష్యం వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా

రామసముద్రం : రామసముద్రం మండలంలో రెవెన్యూ సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించేదిలేదని తహసీల్దార్ నిర్మలాదేవిని ఎమ్మెల్యే షాజహాన్ బాషా హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కుసుమ కుమారి అధ్యక్షతన సాధారణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే పలు శాఖలపై సమీక్షించారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం సంబంధిత వీఆర్వో, ఆర్ఐ సర్టిపై చేసినా సంబంధిత కుటుంబసభ్యులు అందరూ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి వివరణ ఇవ్వాలంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూములను ఆన్‌లైన్‌లో చేర్చడాని, ముటేషన్‌కు కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా ప్రదక్షిణలు చేయాల్సి వస్తుందన్నారు. కేసీ పల్లె, మట్లవారిపల్లె, చెంబకూరు జెడ్పీ హైస్కూల్‌లకు ఆటస్థలం సమకూర్చాలని, ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీలకు ప్రహరీ గోడల నిర్మాణం చేపట్టాలని ఎంఈఓ హేమలత ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఆటస్థలానికి స్థల సేకరణ చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అలాగే ప్రహరీ గోడల నిర్మాణానికి సంబంధిత అధికారులు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. మండలంలో రూ.3 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు జరుగున్నాయని, మరో. రూ.2 కోట్లతో మురుగుకాలువల నిర్మాణాలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే మెరుగైన విద్యుత్ సరఫరా కోసం మండలంలో మరో మూడు విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. 2,500 ఎకరాల డ్రిప్ పరికరాలు రాయితీపై మండలానికి ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

సీఎఫ్ఎంఎస్‌తో కుంటుపడుతున్న మున్సిపల్ అభివృద్ధి

మదనపల్లె : మున్సిపల్ సాధారణ నిధులు సీఎఫ్ఎంఎస్ విధానంలోకి బదలాయింపు జరగడంతో స్థానికంగా అభివృద్ధి కుంటుపడుతోందని, సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి జనరల్ ఫండ్స్ మున్సిపల్ అకౌంట్లోనే ఉండి ఇక్కడే ఖర్చుచేసేలా చూస్తానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ మదనపల్లె మున్సిపాలిటీకి చెందిన రూ.40 కోట్లు సీఎంఎఫ్ఎస్ విధానంలో రాష్ట్ర ఖజానాకు వెళ్లిపోయిందని, నిధులు లేకపోవడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదన్నారు. చిన్న చిన్న పనులు చేసేందుకు మున్సిపాలిటీలో డబ్బులు లేకపోవడంతో ప్రజాసమస్యలు పరిష్కరించలేని దుస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, డీఈ శ్రావణి, మేనేజర్ మనోహర్, టీపీఓ జకీరాఖాతూన్, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

మదనపల్లె : భూవివాదం కారణంగా దాడి చేసిన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మండలంలోని పొన్నూటిపాళెం పంచాయతీ సవరంవారిపల్లెకు చెరందిన రాజశేఖర్ భార్య కోమల(48)కు బంధువు నరసింహస్వామితో కొంత కాలంగా భూ వివాదం నడుస్తోంది. తమకు రావాల్సిన ఆస్తి పంచి ఇవ్వాలని భర్త రాజశేఖర్, బావ రమేష్‌లతో కలిసి నరసింహస్వామిని కోమల నిలదీసింది. దీంతో ఇరు వర్గాల మధ్య గొడవ జరిగింది. దీంతో నరసింహస్వామి, ఆయన కుమారులు సుబ్రహ్మణ్యం,హరికృష్ణ, సరోజమ్మ, గీత తదితరులతో కలిసి కోమల, రాజశేఖర్, రమేష్‌లపై దాడికి పాల్పడ్డారు. మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందారు. కోమల ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆలయాల్లో చోరీలు

మదనపల్లె : మదనపల్లె టూటౌన్ పరిధిలోని మూడు ఆలయాల్లో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. జహా చేనేత నగర్ సమీపంలోని వరాల గంగమ్మగుడి నెల రోజుల క్రితం నిర్మించారు. సోమవారం రాత్రి ఆ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి హుండీ పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. కనకదాసనగర్‌లోని పాలేటమ్మ ఆలయం, సమీపంలోని వరసిద్ధి వినాయస్వామి ఆలయాల్లో సైతం హుండీలు పగలగొట్టి నగదు దోచుకెళ్లారు. చోరీలపై టుటౌన్ పోలీసులకు సమాచారం అందగా ఫిర్యాదు అందలేదని చెబుతున్నారు.

11 లోపు పరీక్షా ఫీజు చెల్లించాలి

పెద్దతిప్పసముద్రం : వచ్చే ఏడాది జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ఫీజులను నవంబర్ 11లోగా చెల్లించాలని ఎంఈఓలు నారాయణ, గౌస్‌పీర్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ ఎస్‌ఎస్‌సీ, ఓఎస్ఎస్‌సీ ఫీజుల వివరాలను సకాలంలో చెల్లించాలని గడువు దాటితే అదనపు రుసుంతో కలిపి ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

తంబళ్లపల్లె : మండలంలో రైతుల వ్యవసాయ సర్వీసులకు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ట్రాన్స్‌కో ఏడీఈ గోవిందరెడ్డి తెలిపారు. మంగళవారం కన్నెమడుగు సబ్‌స్టేషన్‌లో జరిగిన ఆయుధ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కొత్తగా బోరు వేసుకున్న రైతులకు సర్వీసులు మంజూరుతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేస్తామన్నారు. లో ఓల్టేజీ సమస్య ఉన్న చోట్ల అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో ఏఈ శేషుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మాసుం వలియా ఉరుసు

కలకడ : మండలంలోని కలకడ ఇందిరమ్మకాలనీ వద్ద మాసుంవలియా షహీద్ స్వాముల వారి దర్గా వద్ద ఉరుసు మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఉరుసు నిర్వాహకుడు అన్వర్ బాషా తెలిపారు. దేవళంపేట బీఎల్‌ఆర్ కరీం సాహెబ్ ఇంటి నుంచి గంధం ఊరేగింపుగా దర్గా చేరుకుంటుందని, మంగళవారం రాత్రికి కలిచెర్లకు చెందిన యూసఫ్‌హుసేని, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఉమర్ దరాజ్, కర్ణాటకకు చెందిన తహసీన్‌తాజ్‌ల మధ్య కవ్వాలి పాటల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఉరుసు ఉత్సవాల్లో భక్తులు పాల్గొన్నాలని నిర్వాహకులు కోరారు.

ముసలికుంటలో బాల్య వివాహం

కేసు నమోదు చేసిన పోలీసులు

పెద్దమండ్యం : మండలంలోని ముసలికుంటలో బాల్య వివాహం జరగడం కలకలం రేపింది. బాల్య వివాహం ఫొటోలు గ్రామంలో కొందరి వద్ద ఉన్నట్లు బాలిక తండ్రి మంగళవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఎస్ఐ పీవీ.రమణ కథనం మేరకు..

ముసలికుంటకు చెందిన బాలిక(16) స్థానిక పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ప్రతి రోజూ ఆటోలో సహచర విద్యార్థులతో వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేది. ఈ క్రమంలో అదే పంచాయతీలోని దామ్లానాయక్ తండాకు చెందిన నాన్కే నాయక్ బాలికను ప్రేమ పేరుతో వేధిస్తుండడంతో ఇటీవల పాఠశాలకు వెళ్లకుండా నిలిపేశారు. ఇంటి వద్దనే ఉన్న బాలిక 21న అదృశ్యం కాగా చుట్టూ పల్లెల్లో వెతికారు. తండ్రికి అనుమానం రావడంతో నాన్కే నాయక్‌పై ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్‌కు వెళ్తున్నారు. ఈ విషయం తెలుసుకొని నాన్కేనాయక్ బాలికను గ్రామంలో వదిలివెళ్లాడు. ఇదిలా ఉండగా మంగళవారం గ్రామంలో కొందరి వద్ద బాలికను నాన్కే నాయక్ వివాహం చేసుకున్నట్లు ఉన్న ఫొటోలను బాలిక తండ్రి చూశారు. ఈ విషయమై బాలికను విచారించడంతో ఈ నెల 21న నాన్కే నాయక్ తనను ద్విచక్ర వాహనంలో తీసుకొని వెళ్లి తంబళ్లపల్లె మల్లయ్య కొండలో వివాహం చేసుకున్నారని, ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడని తెలిపింది. మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి నమ్మించి వివాహం చేసుకున్న నాన్కేనాయక్‌పై బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



యూటీఎఫ్ నూతన కార్యవర్గసభ్యులు

గుర్రంకొండ : మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన గుర్రంకొండలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్ టి.భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా రవినాయక్, ప్రధాన కార్యదర్శిగా యూసూఫ్‌అలీ, గౌరవాధ్యక్షుడిగా వెంకటయ్య, ఐక్య ఉపాధ్యాయ కన్వీనర్‌గా ఆనంద్, సీపీఎస్ కన్వీనర్‌గా వి.రెడ్డెన్న, మహిళా కన్వీనర్‌గా జి. భారతి, మండల కార్యదర్శులుగా చిన్నరెడ్డెప్ప, శంకరయ్యతో పాటు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో యూటీఎఫ్ క్రియాశీలకంగా పనిచేస్తుందని తెలిపారు.

గ్రామాల్లో వైద్య సేవలు



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి తదితరులు

కలకడ : మండలంలోని ప్రతి సచివాలయాల వద్ద ప్రభుత్వ వైద్యులు ఉచిత వైద్యసేవలు అందిస్తారని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని కె.దొడ్డిపల్లె సచివాలయం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేసి చికిత్స చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిషోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. వాంతులు, విరేచనాలు అయిన వారికి అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు అంగన్‌వాడీ కేంద్రంలో, సచివాలయం వద్ద అందుబాటులో ఉంచామని, అవసరమైన వారు కాచిన లీటరు నీటిలో ఒక ప్యాకేట్ ద్రావనం కలిపి తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, పీహెచ్ఎన్ సుబ్బరత్నమ్మ, సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, సిబ్బంది రెడ్డెమ్మ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడుదాం

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



కార్యకర్తలతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట : తంబళ్లపల్లె నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు పోరాడుదామని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ప్రకటించారు. మంగళవారం ఆయన బి.కొత్తకోటలోని పలు ప్రాంతాల్లో పర్యటించి మాజీ ఎంపీపీ పాగొండ ఖలీల్ అతిథి గృహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థాయిలో నెలకొన్న సమస్యలు, ప్రజలకు అందాల్సిన సౌకర్యాలు, అభివృద్ధిపై చర్చించారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతిపల్లెకు మెరుగైన సౌకర్యాలు కల్పించామని, అభివృద్ధిలో ఎక్కడా రాజీలేకుండా పనిచేశామని గుర్తుచేశారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటిని సమంగా ప్రజలకు అందించామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన అభివృద్ధి పనులను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధికి పెద్దపీట

మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో తంబళ్లపల్లె చరిత్రలో జరగనంత అభివృద్ధి చేసేందుకు నిధులు, పథకాలు మంజూరు చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి పెద్దపీట వేశామని వివరించారు. 2019 జూన్ నుంచి 2013 డిసెంబర్ వరకు నియోజకవర్గంలో ప్రభుత్వశాఖల ద్వారా రూ.2,500 కోట్ల మేరకు అభివృద్ధి పనులు మంజూరైనట్టు చెప్పారు. వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రుల్లో రూ.6.53 కోట్లతో ఆక్సిజన్ ప్లాంట్లు, మౌలిక వసతుల కల్పన, గడప గడపకు మన ప్రభుత్వం, ఉపాధి హామీ పథకం ద్వారా రూ.26.16 కోట్ల మురికినీటి కాలువలు, సీసీరోడ్లు వేశామని తెలిపారు. జేజేఎం ద్వారా రూ.17.10 కోట్లతో ఇంటింటికి కొళాయి ఏర్పాటు చేసామన్నారు. నాడు-నేడు ద్వారా రూ.54.80 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, పేదలకు మంజూరు చేసిన పక్కా ఇళ్ల నిర్మాణాలకు రూ.150 కోట్లు చెల్లించామని చెప్పారు. సంక్షేమ పథకాల ద్వారా నియోజకవర్గ ప్రజలకు రూ.1,224.39 కోట్ల లబ్ధి చేకూర్చామని తెలిపారు. నాన్ డీబీటీ ద్వారా రూ.278.82 కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాగొండ ఖలీల్, మాజీ సర్పంచ్ అమరనాథరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఎస్.అయూబ్, కంబాలపల్లె శంకర్‌రెడ్డి, సల్మాన్, రాయల్ సలీం, నక్కా మహేష్, చిన్నికృష్ణ, సద్దాం పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మాట్లడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అధైర్యపడొద్దని అండగా ఉంటామని ఉంటానని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి భరోసా ఇచ్చారు. మంగళవారం పీలేరు, కేవీపల్లె మండలాల్లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డితో తాను కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు. పీలేరు పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనాథరెడ్డి ఇటీవల గృహప్రవేశం చేసిన ఇంటిని సందర్శించారు. బంగారువాండపల్లెలో ఏనుగుల దాడిలో మృతిచెందిన రాజారెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. పీలేరు పట్టణంలోని నాగిరెడ్డికాలనీకి చెందిన రిటైర్డ్ లెక్చరర్ నాగిరెడ్డి సతీమణి ఇటీవల మృతిచెందగా.. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆమె మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. కేవీపల్లె మండలం గ్యారంపల్లె ఎంపీటీసీ సభ్యులు సూర్యనారాయణరెడ్డిని మహల్‌రాజుపల్లెలో కేవీపల్లె మండల ఉపాధ్యక్షుడు హరిబాబు నూతన గృహప్రవేశం సందర్భంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్‌లు జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, సర్పంచ్ హబీబ్‌బాషా, శ్రీనాథరెడ్డి, చక్రధర్, నారే వెంకటరమణారెడ్డి, హరిత, ద్వారకనాథరెడ్డి, నాగభూషణం, ఆనంద్, భాస్కర్‌రెడ్డి, రమణ పాల్గొన్నారు.

మందులు దొంగలించిన సెక్యూరిటీని పట్టించిన రోగులు



మహిళా సెక్యూరిటీ శాంతమ్మ బ్యాగులో లభించిన మందులు

మదనపల్లె : పని చేస్తున్న ఆస్పత్రిలోనే మందులు దొంగలించిన సెక్యూరిటీ విభాగం మహిళను ఆస్పత్రిలోని రోగులు పట్టించిన సంఘటన మంగళవారం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో జరిగింది. ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న మహిళా సెక్యూరిటీ శాంతమ్మ మందులు చోరీ చేసి బ్యాగులో ఉంచుకున్న విషయాన్ని రోగులు గమనించి వీడియో తీశారు. ఆ వీడియోను ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.ఎస్.రాజుకు ఓ మీడియా వ్యక్తి ద్వారా చేరవేశారు. స్పందించిన సూపరింటెండెంట్ శాంతమ్మను పిలిపించి విచారించి ఆమె వద్దనున్న బ్యాగును తనిఖీ చేశారు. అందులో రెండు సైలెన్‌బాటిళ్లు, నాలుగు వైల్స్ డైక్లోఫినాక్ ఇంజెక్షన్లు, సర్జికల్ బ్లేడు, జలుబుకు సంబంధించిన మాత్రలు ఉండటాన్ని గమనించారు. దీనిపై ఆమెను విచారించగా తనకు ఏమీ తెలియదని, ఏఓ ఉద్దేశపూర్వకంగా ఉంచారని సమాధానం ఇచ్చింది. దీంతో ఘటనపై విచారించి నివేదిక అందజేయాల్సిందిగా ఆర్ఎంఓ ప్రసాద్‌రాజును ఆదేశించారు.

బీటీ కాలేజ్‌లో ఎస్వీ యూనివర్సిటీ గేమ్స్ ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న పీడీ ప్రొఫెసర్ ఎం.శివశంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి

మదనపల్లె : బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేదికగా ఎస్వీ యూనివర్సిటీ 2024–25 విద్యాసంవత్సర మూడోవిడత ఆటలపోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. బీటీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్.ఆర్. కృష్ణవేణి అధ్యక్షతన తిరుపతి శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎం.శివశంకరరెడ్డి జ్యోతి ప్రజ్వలనతో క్రీడాపోటీలను ప్రారంభించారు. యూనివర్శిటీ పరిధిలోని అన్ని కళాశాలల నుంచి క్రీడల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడమే కాకుండా మానవ, సాంఘిక సంబంధాలను మెరుగుపరుస్తాయన్నారు. బీటీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్.ఆర్.కృష్ణవేణి మాట్లాడుతూ పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ఆడి ఎస్వీయూనివర్శిటీకి, బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్.ఎస్.శ్రీనివాసులు, బీటీ కాలేజ్ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చెస్, టేబుల్ టెన్నిస్ విజేతలు

ఎస్వీ యూనివర్శిటీ ఇంటర్ కొలిజియేట్ 2024 చెస్, టేబుల్ టెన్నిస్ క్రీడాపోటీలు పట్టణంలోని శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. చెస్ సెలక్షన్ టోర్నమెంట్‌లో 11 కళాశాలలు పాల్గొన్నాయి. 20 మంది క్రీడాకారులు 4 రౌండ్స్‌లో పోటీపడ్డారు. అందులో ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల తిరుపతికి చెందిన ఎన్ఎస్.బాలాజీ మొదటిస్థానంలో, ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ తిరుపతికి చెందిన హర్షవర్ధన్ రెండోస్థానంలో, ఎస్వీయూ సీఈ తిరుపతికి చెందిన కే.అరవింద్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల జే.యశ్వంత్, కుప్పం డిగ్రీ కాలేజ్‌కు చెందిన జగపతి విజేతలుగా ఎంపికయ్యారు. టేబుల్‌టెన్నిస్‌లో సింగిల్స్ విన్నర్ ఎం.హరిబాబు (సీకామ్ కాలేజ్), రన్నర్ జి.సంతోష్, టేబుల్ టెన్నిస్ డబుల్స్ విన్నర్ కే.విజయ్‌రాజ్, జే.ప్రశాంత్ (సీకామ్ డిగ్రీ కాలేజ్), రన్నర్స్ ఎం.స్వరాజ్, ఎం.మనోజ్ (ఎస్వీ.కాలేజ్) విజేతలుగా నిలిచారు. విజేతలకు జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ షీల్డ్ బహూకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, బాలాజీప్రసాద్, బాలసుబ్రహ్మణ్యం, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న మోటివేటర్ రామ్మూర్తి

కురబలకోట : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని మోటివేటర్ రామ్మూర్తి ఆకాంక్షించారు. అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో రాణించాలంటే స్కిల్స్ తప్పనిసరి అని అన్నారు. పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. లక్ష్య సాధనకు కష్టపడి చదవాలని సూచించారు.

• జనావాసాల్లోకి నెమళ్లు

ములకలచెరువు : మండలంలోని పెద్దపాళ్యం, మద్దినాయునిపల్లెలో జనావాసాల్లోకి సోమవారం నెమళ్లు వచ్చాయి. ఈ రెండు గ్రామాల్లో నెమళ్లు సంచరిస్తూ స్థానికుల్ని ఆహ్లాదపరిచాయి. చుట్టు పక్కల ఉన్న అటవీ ప్రాంతాల్లో నెమళ్లు ఎక్కువగా ఉండడంతో గ్రామాల్లోకి నెమళ్లు అప్పుడప్పుడు వస్తుంటాయని స్థానికులు అంటున్నారు. చాలా వరకు నెమళ్లు రోడ్లను దాటుతూ మృత్యువాత పడినట్లు స్థానికులు తెలిపారు. అటవీశాఖ అధికారులు నెమళ్ల పరిరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



పెద్దపాళ్యం పంచాయతీ రామానాయునికోట వద్ద మేత మేస్తున్న నెమళ్లు